**కృష్ణా నది నీళ్లను న్యాయంగా పంచుకుందాం**

# ధర్నా

**శుక్రవారం 22 మార్చి 2002**

**ఇందిరా పార్క్ వద్ద**

**హైదరాబాద్**

**ఉదయం 10 గంటల నుండి**

ప్రజలారా!

ప్రాంతీయ అసమానతల గురించి ఎంతగా గొంతు చించుకున్నా మన రాష్ట్రపాలకులు తమకేమీ పట్టనట్టు తమ వ్యవహారాలు సాగించుకుంటున్నారు.

గొంతు చించుకోవడం తప్ప వీరింకేమీ చేయలేరని వారి ధీమా. దానిని అబద్ధం చేయడం మన కర్తవ్యం.

ప్రాంతీయ అసమానతలన్నింటిలోకీ కొట్టొచ్చినట్టు కనిపించేదీ, కొన్ని దశాబ్దాలుగా పదే పదే కరువు ప్రాంతవాసులు ఎత్తి చూపుతున్నదీ కృష్ణానదీ జలాల పంపిణీ విషయంలో జరిగిన అన్యాయం. మన రాష్ట్రం ఒకటిగా ఉంటుందా, లేక చీలి ముక్కలవుతుందా అనేది దీని మీదనే ప్రధానంగా ఆధారపడి ఉందంటే అతిశయోక్తి కాదు.

కృష్ణానది అన్నప్పుడు దాని ఉపనదులయిన తుంగభద్ర, బీమా, మూసీలను, వాటి ఉపనదులను, వాగులను కలుపుకొని మాట్లాడుకుంటున్నాం. ఈ నదీ వ్యవస్థ ఎగువభాగాన దేశంలోనే అతి తీవ్రమైన క్షామానికి నిలయమైన జిల్లాలున్నాయి. ఆకలిచావులు, వలసలు, నికృష్టమైన బతుకులు వాటి దైనందిన జీవితగాథ. ఆ నది నీళ్లు ప్రధానంగా ఆ ప్రాంతాలకు దక్కవలసింది.

కానీ దక్కుతున్నది సహజంగానే ఎక్కువ వర్షపాతం, సారవంతమైన నేలలు, భూగర్భజలాలు ఉన్న సర్కారు జిల్లాలకు.

ఆ జిల్లాలు సుభిక్షంగా ఉంటే మాకేమీ కడుపుమంటలేదుగానీ, కృష్ణానదీ జలాలను న్యాయబద్ధంగా పంచుకుంటే అందరమూ ఒకేరకంగా సుఖపడవచ్చును కదా అంటున్నాం. గతంలో ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్రల మధ్య కృష్ణానదీ జలాలను పంచిన బచావత్ అవార్డు మన రాష్ట్రానికి కేటాయించిన 800 శతకోటి ఘనపుటడుగుల (టి.ఎం.సిల) నీటిలో దాదాపు సగం (వాస్తవానికి అంతకంటే ఎక్కువే) సర్కారు జిల్లాలకు సాగునీరిచ్చే ప్రాజెక్టులకు దక్కింది. అక్కడ రెండేమిటి మూడు పంటలకు కూడా కాలవ నీళ్లు పెట్టుకుంటుండగా, ఎగువన నల్లగొండ నుండి అనంతపురం దాకా విస్తరించి ఉన్న కరువు నేలలు సాగు చేస్తున్న రైతులు ఒక పంటకు కూడా సాగునీరు లేక పశువులను అమ్ముకొని భూములను బీడు పెట్టుకొని కాలవలున్నకాడ కూలయినా దొరుకుతుందని

వలసపోతున్నారు. మహబూబ్‌నగర్ ప్రజలయితే కాలవల కింద కూలికే కాక అన్ని రకాల కట్టడాలలో ముఠాకూలీలుగా దేశమంతా సంచరిస్తున్నారు.

బచావత్ అవార్డు అమలులో ఉన్నంత కాలం ఎగువప్రాంతాల కరువు జిల్లా ప్రజలు ప్రాజెక్టుల గురించి ఎప్పుడు ఆందోళన చేసినా బచావత్ అవార్డు కింద రాష్ట్రానికింక నికరజలాలు లేవనీ మిగులు జలాల పైన ప్రాజెక్టులు కట్టడానికి వీలు లేదనీ మన పాలకులు అంటూ వచ్చారు.

నిజానికి బచావత్ అవార్డుకు లోబడి ఉంటూనే కృష్ణా డెల్టాకూ సాగర్ కుడికాలవకూ పోయేనీటిలో మూడవ వంతును తగ్గించి శ్రీశైలంలోనూ దానికి ఎగువనూ నిలుపుకొని కరువు ప్రాంతాలకు నీళ్లిచ్చే ప్రాజెక్టులు కట్టుకొని ఉండవచ్చును. బచావత్ అవార్డు ఒక రాష్ట్రానికి కేటాయించిన వాటాకు లోబడి ఆ రాష్ట్రంలోపల ఒక ప్రాజెక్టుకు తగ్గించి ఇంకొక ప్రాజెక్టుకు ఇచ్చుకోవచ్చుననీ, ప్రాజెక్టుల పరిమాణాలు సాపేక్షంగా మార్చుకోవచ్చుననీ సుప్రీంకోర్టు ఆల్మట్టి కేసులో స్పష్టం చేసింది. ఆ విషయం బచావత్ అవార్డులోనే స్పష్టంగా ఉంది.

సాధ్యంకాక కాదుగానీ ఇష్టం లేక ఇన్నాళ్లూ ఆ పని చేయలేదు.

ఇప్పుడు సాకుగా చెప్పడానికి బచావత్ అవార్డు లేదు. దాని గడువు 2000 సంవత్సరం మే నెలతో తీరిపోయింది. పూర్తిగా కొత్త ఒప్పందం చేసుకొని మూడు రాష్ట్రాల మధ్యనే కాక, రాష్ట్రంలోని మూడు ప్రాంతాల మధ్య కూడా న్యాయం జరిగేటట్టు కృష్ణానదీ జలాల పునఃపంపిణీ ఇప్పుడు చేసుకోవచ్చు.

బచావత్ అవార్డు గడుపు తీరిపోయిన క్షణం నుండీ, తాము కొత్త ఒప్పందానికి సిద్ధమనీ మాట్లాడదాం రమ్మనీ కర్నాటక ముఖ్యమంత్రి మన రాష్ట్ర ప్రభుత్వాన్ని ఉద్దేశించి ఒకసారి కాదు, పలుమార్లు అన్నాడు. మన పాలకులే నిమ్మకు నీరెత్తినట్టు ఉన్నారు. చర్చలకు కూర్చుంటే రాష్ట్రంలోపల ఆ నది నీటి పంపిణీలో జరిగిన అన్యాయం కూడా చర్చకు రాకతప్పదని వారికి తెలుసును కాబట్టే మౌనంగా ఉంటున్నారు.

ఈ కపటత్వాన్ని మనమెందుకు ఆమోదించాలి? ఆమోదించి ఊరుకుంటే కర్నాటక కేంద్ర ప్రభుత్వానికి అర్జీ పెట్టుకొని, బచావత్ ట్రిబ్యునల్ వంటి ఇంకొక ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేయిస్తుంది. అప్పుడు మళ్లీ కరువు జిల్లాల నీటి హక్కులు సాంకేతిక అవరోధాలకు బలి అవుతాయి.

రాజకీయ చర్చల ద్వారా నది నీటి పునఃపంపిణీ జరిగితేనే కరువు ప్రాంతాలకు న్యాయం జరుగుతుంది. కర్నాటక, మహారాష్ట్రలతో మన రాష్ట్రప్రభుత్వం త్రైపాక్షిక చర్చలకు కూర్చోవాలనీ, ఆ చర్చలలో మన రాష్ట్రం తరపున కేవలం ప్రభుత్వ అధికారులే కాక కృష్ణానది నీటిపైన ఆధారపడే కరువు జిల్లాల రైతాంగం ప్రతినిధులు కూడా పాల్గొనాలనీ డిమాండ్ చేద్దాం. సర్కార్ జిల్లాలకు కృష్ణానది నీటిలో ఈ రోజు ఇస్తున్న వాటాను గణనీయంగా తగ్గించి, వారిని పంట మార్పిడికి ఒప్పించి, కరువు జిల్లాలలో ప్రస్తుతం ఉన్న 'పెండింగ్ ప్రాజెక్టులకు' నీరు కేటాయించి ఆ ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేద్దాం. కరువు జిల్లాల ప్రజా ప్రతినిధులు ఈ డిమాండ్ చేపట్టి ప్రజాప్రతినిధులుగా తమ విధి నిర్వర్తించాలని డిమాండ్ చేద్దాం.

ఈ డిమాండ్ల సాధన కోసం ఈ సంవత్సరం జనవరి 27న గద్వాలలో జరిగిన సదస్సు ఫలితంగా కృష్ణా నదీజలాల పునఃపంపిణీ ఉద్యమం ఏర్పడింది. దాని ఆధ్వర్యంలో మార్చి 22న హైదరాబాద్‌లో జరగబోయే ధర్నాను జయప్రదం చేయవలసిందిగా అందరినీ కోరుతున్నాం.

- కృష్ణానదీ జలాల పునఃపంపిణీ ఉద్యమం

19.03.2002